ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 12 జూలై 2024

చన్నపట్టణ నుంచి బరిలోకి సినీ నటి రమ్య..!

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చన్నపట్టణ శాసనసభ నియోజకవర్గానికి తమ్ముడు డీకే సురేశ్ వెనుకడుగు వేసిన తర్వాత దీటైన అభ్యర్థి కోసం డీకే భారీగానే కసరత్తు చేస్తున్నారు. తాజాగా మండ్య మాజీ ఎంపీ, సినీ నటి రమ్యను బరిలోకి దింపాలని ప్రయత్నిస్తున్నారు. బీజేపీ, జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా సీపీ యోగేశ్వర్ పేరు వినిపిస్తోంది. అతడికి దీటైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు రమ్యను బరిలోకి దింపితే మహిళా ఓటర్లను ఆకట్టుకోవచ్చునని వ్యూహం రచిస్తున్నారు. రమ్య, రాహుల్‌గాంధీ బృందంలో పనిచేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సోషల్‌మీడియా ముఖ్యులుగా వ్యవహరించారు.

సర్కార్‌కు 5 సవాళ్లు..!

- సిద్దూను వణికిస్తున్న ఆ ఐదు అంశాలు
- వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై ఈడీ సీరియస్
- ముడా వివాదంలో ముఖ్యమంత్రికి ముచ్చెమటలు
- తలనొప్పిగా మారిన బదిలీల దందా, ఉద్యోగుల సమ్మె అంశాలు
- డెంగీ విజృంభణపై ఆందోళన
- మరో నాలుగు రోజుల్లో శాసనసభ సమావేశాలు



బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఐదు గ్యారెంటీల ఉత్సాహంతో ఏడాదిపాటు ఊగిసలాడిన రాష్ట్ర సర్కార్‌కు లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. త్వరలోనే శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతుండడంతో ప్రతిపక్షాలకు పదునైన అస్త్రాలు లభించినట్టయ్యింది. సర్కార్‌ను ఐదు సవాళ్లు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. ప్రధానంగా వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి, ముడాలో ఇళ్లస్థలాల కుంభకోణం, బదిలీల దందా, డెంగీ నియంత్రణలో విఫలం, సమ్మె బాటలో ప్రభుత్వ ఉద్యోగుల అంశాలు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. బదిలీలలో దందా తారస్థాయిలో విమర్శలకు కారణమైంది. ఇక ప్రతిష్ఠాత్మకం అని భావించిన ఐదు గ్యారెంటీలలో లోపాలను సరిచేయడంలో అధికారులు సకాలంలో చొరవ చూపకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు రోడ్డెక్కే పరిస్థితి కనిపిస్తోంది. ఈలోగానే వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 187 కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు ఉన్నా 94 కోట్ల రూపాయల నగదు బదిలీలో ఇంతవరకు 11మందిని అరెస్టు చేయగా రూ.14.5 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివాదం జాతీయస్థాయిలో చర్చకు కారణం కావడం సిద్దరామయ్య ప్రభుత్వంలో తొలి వికెట్‌గా మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాల్సి వచ్చింది. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రంగంలోకి దిగి నాగేంద్ర అనుచరులు ఇద్దరిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు రాయచూరు రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బసనగౌడ దద్దల్, నాగేంద్ర నివాసాలు, కార్యాలయాలపై ఈడీ దాడులు చేసింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)లో ఇళ్లస్థలాల పంపిణీలో ఏకంగా 3వేల కోట్ల రూపాయలకుపైగా అవినీతి జరిగిందనే అంశం హల్‌చల్ చేస్తోంది. సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి 14 ఇళ్లస్థలాలు కేటాయించిన ఆరోపణలతో ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఈ అంశాలు ప్రతిపక్షాలకు ప్రధానమైన అంశాలుగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. ఐదు గ్యారెంటీల పథకాల అమలుతో ధీమాలో ఉన్న అధికార పార్టీకి సొంత ఎమ్మెల్యేలనుంచి ఇబ్బందులు తలెత్తాయి. అభివృద్ధికి గ్రాంట్లు లభించడం లేదని బహిరంగంగానే విమర్శలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ కనీసం 20 స్థానాలు గెలుపు సాధిస్తామనే ధీమాలో ఉండేవారు. అయితే కేవలం 9 స్థానాలకే పరిమితం కావడం, ప్రత్యేకించి బెంగళూరు పరిధిలోని 3 స్థానాలు, బెంగళూరు గ్రామీణ, మండ్య, మైసూరు స్థానాలను కోల్పోవడం అగ్రనేతలకు షాక్ ఇచ్చినట్లయ్యింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్ర బీజేపీలో కొంత నిరుత్సాహం ఉన్నా ఫలితాల తర్వాత జోష్ పెరిగినట్టయ్యింది.

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అక్రమంగా నగదు బదిలీ చేసిన వివాదంలో ప్రభుత్వం తొలి వికెట్‌గా నాగేంద్ర రాజీనామా చేశారు. ఆయనతో వివాదం పూర్తిగా సమసినట్లు కాలేదు. వివాదాన్ని సిట్ విచారిస్తోంది. అయితే నగదు బదిలీపై బ్యాంకు ఉన్నతాధికారులపైన ఆరోపణలు రావడం యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ సమగ్ర దర్యాప్తుకోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు లేఖ రాశారు. దీంతో ఈడీ రంగంలోకి దిగింది. నాలుగు రోజులుగా తీవ్ర కసరత్తు సాగిస్తున్నారు. ఎంజీ రోడ్డు యూనియన్‌బ్యాంకు ద్వారా వివరాలు సేకరించిన అధికారులు బుధవారం మాజీ మంత్రి నాగేంద్ర, రాయచూరు జిల్లా ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్‌ల నివాసాలపై దాడులు చేశారు. బెంగళూరు సదాశివనగర్ డాలర్స్ కాలనీలోని మాజీ మంత్రి నాగేంద్ర నివాసంపై దాడి చేసి ఆప్త సహాయకుడు హరీశ్‌ను అదుపులోకి తీసుకుని ఈడీ కార్యాలయానికి తరలించారు. వాల్మీకి కార్పొరేషన్ వివాదం ముగియకముందే మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)లో ఇంటి స్థలాల కేటాయింపు సంచలనమైంది. ఏకంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య భార్య పార్వతికి 50/50 స్థలం పంపిణీలో భాగంగా 14 సైట్లు కేటాయించడం భారీ వివాదానికి కారణమవుతోంది. ఇక పాడి రైతులకు పాల ప్రోత్సాహక మొత్తాన్ని ఆరు నెలలుగా విడుదల చేయలేదు. గత ఏడాది ఖరీఫ్, రబీ పంటలు దెబ్బతినడంతో ప్రత్యామ్నాయ జీవనమైన పాడి ద్వారా రైతులకు చేదోడుగా ఉంది. ప్రోత్సాహక ధనాన్ని ఆరు నెలలుగా విడుదల చేయకపోవడం విమర్శలు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. రాష్ట్రమంతటా డెంగీ జ్వరం తీవ్రం కావడంతో రోజూ వందల్లో కేసులు నమోదవుతున్నాయి. ఇలాంటి తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్న సర్కార్‌కు ఉద్యోగులు దీటైన ఎదురుదెబ్బ కొట్టేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఏడో వేతన కమిషన్, పాత పెన్షన్ విధానం, ఆరోగ్య బీమా వర్తింపచేయాలనే డిమాండ్‌తో ఈనెలాఖరున సమ్మెలకు వెళ్తామని ప్రకటించారు. ఈలోగా అంచెలంచెలుగా నిరసనలు పాటించదలిచారు. శాసనసభ సమావేశాల వేళ ఉద్యోగులు నిరసనకు దిగితే పాలకుల పరిస్థితి అగమ్యగోచరం కానుంది. ఇలా కీలకమైన అస్త్రాలతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. బీజేపీ - జేడీఎస్‌లు సమావేశాల ఆరంభానికి ముందే కీలక సమావేశం ఏర్పాటు చేసి ఉభయ సభల్లో సర్కార్‌కు ముప్పుతిప్పలు పెట్టదలిచారు.



మైసూరులో ఇంటివద్ద ఫిర్యాదులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య


అధ్వానంగా మారిన ముడా

- అవినీతిపై దర్యాప్తు చేపట్టిన ఐఏఎస్ అధికారులు
- మా ప్రభుత్వంలోనూ తప్పులు జరిగాయి..
- నేను సీఎం కావడం కొందరికి ఇష్టం లేదు: సిద్దూ

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి సంస్థ ముడా అధ్వానంగా మారిందని దారిలోకి తీసుకువస్తానని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. గురువారం మైసూరులోని నివాసం వద్ద ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇదే సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ముడా అవినీతిపై ఇద్దరు ఐఏఎస్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. సమగ్ర నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ పాలనలోనే కాకుండా తమ ప్రభుత్వంలోనూ తప్పులు జరిగాయని వాటిని సరిచేస్తానన్నారు. రాష్ట్ర బీజేపీ నేతలకు తాను రెండోసారి ముఖ్యమంత్రి కావడమే ఇష్టం లేదన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. చట్టపరంగా విచారణ సాగుతున్న వివాదంపైనా రోజూ పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన భార్య పార్వతి పేరిట ఇంటి స్థలం కేటాయించడం అక్రమమే కాదన్నారు. బీజేపీ వ్యవధిలోనే తన భార్యకు ఇంటి స్థలం మంజూరు చేశారన్నారు. స్థలం వచ్చినప్పుడు తాను ప్రతిపక్ష నేతగా ఉన్నానన్నారు. ముడా తప్పు చేసి ఆతర్వాత పరిహారంగా స్థలం ఇచ్చిందన్నారు. భూమి కోల్పోయిన మేం స్థలం పొందడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. తమకు ఇచ్చిన స్థలం వారే వాపసు తీసుకుని వడ్డీతో కలిపి రూ.62 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తాను రెండోసారి సీఎం కావడాన్ని జీర్ణించుకోలేని కొందరు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు.

తప్పు చేశాం..

- సరిదిద్దుకుంటాం
- లోక్‌సభలో తక్కువ స్థానాలపై డీకే



బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన వాటి కంటే తక్కువ స్థానాలు దక్కడంపై ఆత్మ విమర్శ చేసుకుంటామని, ఏవైనా తప్పులుంటే సరిదిద్దుకుంటామని కేపీసీసీ అధ్యక్షులు డీకే శివకుమార్ పేర్కొన్నారు. గురువారం కేంద్ర పార్టీ పరిశీలనా కమిటీ ముందు రాష్ట్రంలో ఓటమికి కారణాలపై విశ్లేషణ జరిగింది. ఢిల్లీ ప్రతినిధులుగా మధు సూదన్ మిస్త్రీ నేతృత్వంలో ఎంపీలు గౌరవ్‌గొగోయి, హిబి హిడన్ తదితరులు హాజరయ్యారు. సమీక్ష అనంతరం డీకే శివకుమార్ కేపీసీసీ వద్ద మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలలో గతంలో కేవలం ఒకరు మాత్రమే ఎంపీ ఉండేవారని ప్రస్తుతం 9స్థానాలకు చేరామన్నారు. కనీసం 14-15 సీట్లు గెలుస్తామని భావించామని సాధ్యం కాలేదన్నారు. లోక్‌సభ ఎన్నికలలో ఉత్తమ అభ్యర్థులనే పోటీలో నిలిపామన్నారు అయితే ప్రజలు ఎందుకు ఇలాంటి తీర్పు ఇచ్చారనేది పరిశీలించుకుంటామన్నారు. గతం కంటే ఎనిమిది స్థానాలు అధికంగా వచ్చాయని సర్ది చెప్పుకోవడం లేదన్నారు. కేంద్ర కమిటీ ముందు అన్ని విషయాలు సమగ్రంగా చర్చించామన్నారు. భవిష్యత్తులో ఏవిధంగా మసలుకోవాలనేది ప్రణాళిక బద్ధంగా నిర్ణయం తీసుకుంటామని వివరించామన్నారు. గ్యారెంటీ పథకాలకు ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతర పథకాలకు వినియోగించారనే విషయమై జాతీయ ఎస్టీ కమిషన్ చీఫ్ సెక్రటరీకి నోటీసులు జారీ చేయడంపై స్పందిస్తూ దేశంలో ఆంధ్రప్రదేశ్ తర్వాత కర్ణాటకలో మాత్రమే సబ్‌ప్లాన్ అమలు చేస్తున్నామన్నారు. జాతీయ కమిషన్ కేంద్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీయులకు బడ్జెట్‌లో కేటాయించిన విధంగానే నిధులు వినియోగిస్తున్నామన్నారు. నోటీసులు ఇచ్చేందుకు కమిషన్‌కు సిగ్గు ఉండాలన్నారు.

కాంగ్రెస్ అంటే.. వారిద్దరే కాదు

- మిస్త్రీ కమిటీకి బీకే హరిప్రసాద్ నివేదిక..!



బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లోక్‌సభ ఎన్నికల్లో తక్కువసీట్లు సాధించడంపై అధిష్ఠానం నిజనిర్ధారణ కమిటీని పంపింది. పార్టీ సీనియర్ నేత మధుసూధన్ మిస్త్రీ నేతృత్వంలోని కమిటీ బెంగళూరుకు వచ్చారు. కేపీసీసీలోని భారత్‌జోడో భవన్‌లో గురువారం వారు అభిప్రాయ సేకరణ ప్రక్రియ సాగించారు. డీసీఎం, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు డీకే శివకుమార్ ఓ ప్రత్యేక నివేదికను ఇచ్చారు. మిస్త్రీ కమిటీతో పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఓటమికి కారణాలపై ఓ నివేదికను సమర్పించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్న హరిప్రసాద్ నివేదికకు కమిటీ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర కాంగ్రెస్ అంటే కేవలం సీఎం, డీసీఎంలు ఇద్దరు మాత్రమే కాదని నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలవేళ సమష్టిగా పనిచేసినందుకు సత్ఫలితాలు వచ్చాయని అయితే లోక్‌సభ ఎన్నికల్లో సీనియర్ల సలహాలు పట్టించుకోలేదని పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు మంత్రుల కుటుంబికులకు టిక్కెట్లు ఇవ్వడం రాష్ట్రస్థాయిలో వెనుకబాటుకు కారణమైందని, కార్యకర్తలను పరిగణించలేదని, బోర్డులు కార్పొరేషన్‌ల నియామకాలలో సీఎం, డీసీఎం మద్దతుదారులకే అవకాశం ఇచ్చారని రాష్ట్రంలో అత్యధిక జనాభా కల్గిన లింగాయత, ఒక్కలిగ సముదాయాల విశ్వాసం పొందడంలో విఫలమయ్యారని తీరప్రాంత జిల్లాల్లో ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరపలేదని వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పటికే సీఎం సిద్దరామయ్య 'ముడా' అవినీతి ఆరోపణలతో తలమునకలై తల్లడిల్లుతుండగా డీసీఎం డీకే శివకుమార్ బెంగళూరు గ్రామీణలో ఓటమితో వెనుకడుగు వేసినట్లయ్యింది. తాజాగా అధిష్ఠానం కమిటీకి ఎన్నికల్లో ఓటమిపై వారిద్దరినే బాధ్యులను చేస్తూ సీనియర్ నేత హరిప్రసాద్ నివేదిక ఇవ్వడం ఇద్దరికి కొత్త చిక్కులు పెట్టేలా ఉంది. మరింతమంది డీసీఎంలు, నాయకత్వ మార్పు చర్చలకు వారంక్రిందటే తెరపడగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కొత్త వివాదం తలెత్తింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంధన శాఖ మంత్రి జార్జ్

విద్యుత్తు సమస్య తలెత్తరాదు

- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలి
- ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి
- అధికారులకు మంత్రి కేజే జార్జ్ సూచన

బళ్లారి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వానాకాలంలో విద్యుత్తు సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఇంధన శాఖ మంత్రి కేజే జార్జ్ అధికారులకు సూచించారు. గురువారం ఇంధన శాఖకు సంబంధించి జిల్లా పంచాయతీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామీణ, వ్యవసాయ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో గాలి కారణంగా విద్యుత్ స్తంభాలు పడిపోతే తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఉదాసీనత, నిర్లక్ష్యం చూపవద్దని, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్లు తెగిపోతే రైతులు జెస్కామ్ అధికారులను సంప్రదిస్తారని మరమ్మతులపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఫోన్లకు స్పందించకపోతే కఠినచర్యలు తప్పవన్నారు. కంప్లి, కురుగోడు తాలూకాలోని వివిధ గ్రామాలలో పాత విద్యుత్ లైన్లు పోయాయని కంప్లి ఎమ్మెల్యే గణేశ్ తెలిపారు. దీనిపై జెస్కాం అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లానన్నారు. 20వేల ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీటి ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా నిలిచిపోతే దానికి బాధ్యులెవరని ప్రశ్నించారు. దీనిపై జెస్కాం శాఖ చీఫ్ ఇంజినీర్ లక్ష్మణ్ చౌహాన్ వెంటనే స్థలాన్ని పరిశీలించి నివేదిక అందజేయాలని మంత్రి సూచించారు. జిల్లాలో విద్యుత్ సంబంధిత మరణ కేసుల్లో మృతుల కుటుంబాలకు చట్టపరమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గణేశ్ కోరారు. సిరుగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను మంత్రికి తెలియజేశారు. ఈసందర్భంగా మేయర్ ముల్లంగి నందీశ్, డిప్యూటీ మేయర్ సుకుమ్, ముండరగి నాగరాజు, ఇంధన శాఖ డిప్యూటీ చీఫ్ సెక్రటరీ గౌరవ్ గుప్తా, కేపీటీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్‌కుమార్‌పాండే, జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప,జెస్కాం అధికారులు, బీపీటీపీఎస్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై కొరడా

- రాష్ట్రవ్యాప్తంగా లోకాయుక్త మెరుపు దాడులు
- 11 మంది అధికారులు.. 56 ప్రాంతాల్లో..
- భారీగా నగదు, బంగారు స్వాధీనం



బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా లోకాయుక్త అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా ఆధారాలతోనే రంగంలోకి దిగినట్లు సమాచారం. కలబురగి, మైసూరు, దావణగెరె, చిత్రదుర్గ, ధారవాడ, బెళగావితో పాటు 9 జిల్లాల పరిధిలో 11 మంది వివిధశాఖల అధికారులు, ఇంజనీర్‌లకు సంబంధించి 56 ప్రాంతాల్లో దాడులు జరిపారు. గురువారం ఉదయం ఒక్కసారిగా దాడులు జరిపారు. ధారవాడలో బెళగావి నిర్మిత కేంద్ర ప్రాజెక్టు అధికారి శేఖర్‌గౌడ నివాసం, కార్యాలయాలపై దాడులు చేశారు. ధారవాడలో ఇతడికి సంబంధించి రెండు పీజీలు ఉన్నట్లు గుర్తించారు. కేసీడీ రోడ్‌లో సప్తాపుర, రాధాకృష్ణ నగర్‌లలోని పీజీలపైనా దాడులు చేశారు. రామనగర్ జిల్లా ఆరోహళ్ళి తహసీల్దార్ విజియణ్ణకు సంబంధించి ఆరు ప్రాంతాల్లో దాడులు జరిపారు. తుమకూరు, చింతామణి, చిక్కబళ్ళాపురతో పాటు రామనగర్ ఆరోహళ్ళితో పాటు మండ్యలోను దాడులు జరిపారు. విజియణ్ణ కొంత కాలం కిందట కోలార్ తహసీల్దారుగా వ్యవహరించారు. కోలార్ ఎస్పీ ఉమేష్ నేతృత్వంలో దాడులు జరిపారు. కలబురిగిలో నివసిస్తున్న బెంగళూరు పాలికె కెంగేరి విభాగం రెవిన్యూ అధికారి బసవరాజ్ మాగికు నివాసంపైనా దాడి చేశారు. కలబురిగి ఎంబీ నగర్‌లోని ఇంటితో పాటు బెంగళూరు నివాసం, కార్యాలయంపైనా దాడి చేశారు బెళగావి జిల్లా పంచాయతీ అసిస్టెంట్ ఇంజనీర్ దురుదుండేశ్వర బన్నూరకు సంబంధించి నాలుగు ప్రాంతాల్లో దాడులు జరిగాయి. గోకాక్, హరానగా, హిండలగా, యళ్ళూరలలో అధికారులు సోదాలు జరిపారు. గోకాక్‌లో నివాసంతో పాటు హరానగాలో ఫారంహౌస్ ఇతర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌లలో దాడులు జరిపారు. నాలుగు నెలల కిందటే ఇతడిపై లోకాయుక్త దాడి చేయగా ప్రస్తుతం మరోసారి చేశారు. మండ్యనగరంలో రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాజు ఇంటిపై ఎస్పీ సురేష్‌బాబు నేతృత్వంలో దాడి చేశారు. నాగమంగళ తాలూకా ఇజ్జలఘట్ట గ్రామంలోని ఇంటితో పాటు ఫారం హౌస్, మైసూరులోని అల్లుడి నివాసంపైనా దాడి చేశారు. మైసూరు నజరబాద్‌లో నీటి పారుదల విభాగం ఇంజనీర్ కె. మహేష్ ఇంటితో పాటు గోకులంలోని ఆఫీసుపైనా దాడి చేశారు. దావణగెరెలో కెపీటీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీహెచ్ ఉమేష్, ఉమేష్‌కు సంబంధించి దావణగెరెలోని శివకుమారస్వామి లేఅవుట్ ఇంటితో పాటు చిక్కమగళూరులోని కార్యాలయంపైనా దాడి చేశారు. ఎస్పీ ఎంఎస్ కౌలాపురె నేతృత్వంలో దాడి చేశారు. ఏఈఈ బెస్కాం విజిలెన్స్ ఇంజనీర్ ఎంఎస్ ప్రభాకర్‌ల నివాసాలపై దాడులు చేశారు. ఇతడికి సంబంధించి చిత్రదుర్గ, హావేరి, బళ్ళారికి చెందిన లోకాయుక్త అధికారులు ఆరు బృందాలుగా విడిపోయి దాడులు చేశారు. హాసన్‌కు చెందిన గ్రేడ్‌వన్ సెక్రటరీ ఎంఎన్ జగదీష్‌పైనా దాడులు సాగాయి. నివాసం, కార్యాలయాలపై దాడులు చేశారు. దాడుల వేళ ఆదాయానికి మించి ఇంజనీర్లు, అధికారుల వద్ద ఆస్తులు కలిగి ఉన్నట్లు గుర్తించారు.

కుందువాడలో ఒకేరోజు ఏడుగురి మృతి

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దావణగెరె జిల్లా కుందువాడ గ్రామంలో గురువారం ఒకేరోజు ఏడుగురు మృతి చెందారు. వేర్వేరు కారణాలతో మృతి చెందినా ఒకేరోజున ఏడుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. కుందువాడలో సుమారు 3వేలమంది జనాభా ఉన్నారు. వయోసహజ ఆరోగ్య సమస్యలతో మారజ్జి (60) అనే వృద్ధుడు మృతి చెందారు. అతిసారతో సంతోష్ (32) చనిపోయాడు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వీరమ్మ (65), అతిసారతో ధీమక్క (60) మృతి చెందారు. జ్వరంసహా పలు అనారోగ్య సమస్యలతో సునీల్ (25) మృతి చెందారు. శాంతమ్మ (65) వయోసహజ సమస్యలతో మృతి చెందారు. మూడేళ్ల బాలుడు శ్వాసకోశ సమస్యతో ఇబ్బంది పడుతూ మృతిచెందాడు. ఒకేరోజున ఏడుగురి మృతి కారణంగా గ్రామంలో స్మశాన వాటిక లేకపోవడంతో అంత్యక్రియలు జరిపేందుకు ఇబ్బందులు పడ్డారు. గతంలోనూ శ్మశాన వాటికకోసం అధికారుల ఎదుట ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినా అధికారులు చలించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




జ్యోతిప్రజ్వలన చేస్తున్న నటుడు రమేష్‌అరవింద్, రవిచందర్, సుభాష్‌చంద్ర, నరసింహరాజు తదితరులు

ఆంధ్రాశైలి రుచులకు పేరొందిన నందన

25వ శాఖ ప్రారంభంలో నటుడు రమేష్ అరవింద్

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాశైలి రుచులకు నందన ప్యాలెస్ రెస్టారెంట్ పేరొందిందని ప్రముఖ నటుడు రమేష్ అరవింద్ ప్రశంసించారు. గురువారం దేవనహళ్ళిలో నందనా ప్యాలెస్ 25వ శాఖను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ అరవింద్ మాట్లాడుతూ నాణ్యతకు రుచికి నందన ప్యాలెస్ ఎన్నో ఏళ్ళుగా గుర్తింపు కలిగి ఉందన్నారు. బెంగళూరులో ఏ ప్రాంతానికి వెళ్ళినా నందన ప్యాలెస్‌లు ఉన్నాయన్నారు. నందనా ప్యాలెస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవిచందర్ మాట్లాడుతూ వినియోగదారులు తమ హోటల్ పట్ల చూపుతున్న విశ్వాసం, నమ్మకానికి నిదర్శనంగానే శాఖలు తెరుస్తున్నామన్నారు. 1989 నుంచి హోటల్ రంగంలో ఉన్నట్లు తెలిపారు. తమ వద్ద మటన్, చికెన్, ప్రాన్స్, చేపల వంటకాలు ఆదరణ పొందాయన్నారు. వినియోగదారులు ఆశయాలకు అనుగుణంగానే రుచులు వండించడం తమ ప్రత్యేకత అన్నారు. జమీన్‌దార్ కె.చన్నమ్మ, పాపణ్ణ, పారిశ్రామిక వేత్తలు అడ్యార్ ఆనందభవన్ ఎండీ కేటీ వెంకటేష్ రాజ, కేటీ శ్రీనివాసరాజతో పాటు సంగీతా మొబైల్స్ ఛైర్మన్ సుభాష్‌చంద్ర ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్‌వీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1604.12	1,581.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	25,349	17761
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	205	265
సామర్థ్యం (టీఎంసీలు)	27.33	5.42

రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న అశోక్‌జైన్, సిరిగేరి పన్నరాజ్

బళ్లారి సిటీ, జూలై 11: ఈసారి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాయచూరుకు ఎయిమ్స్ ఆసుపత్రిని కేటాయించాలని రాయచూరు ఎయిమ్స్ పోరాట సమితి నాయకుడు అశోక్ కుమార్ జైన్ అన్నారు. నగరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020లోనే రాష్ట్రానికి ఎయిమ్స్ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. ఆసుపత్రి ప్రారంభించడానికి అవసరమైన భూమి, నీటి కనెక్షన్ల వ్యవస్థ రాయచూరులో అందుబాటులో ఉందన్నారు. ప్రత్యర్థి పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ కూడా భారత్ జోడో యాత్రలో ఇందు కోసం హామీ ఇచ్చారని తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో రాయచూరును ప్రకటించాలని, లేని పక్షంలో ఢిల్లీకి వెళ్ళి జంతర్ మంతర్ వద్ద పోరాటం చేస్తామన్నారు. సిరిగేరి పన్నరాజ్ మాట్లాడుతూ మైనింగ్‌దుమ్ము కారణంగా ఈ ప్రాంతంలో క్యాన్సర్ తీవ్రమవుతోందన్నారు. కిద్వాయ్ క్యాన్సర్ హాస్పిటల్ బ్రాంచిని ఇక్కడ ప్రారంభించాలని కోరారు. ఈసందర్భంగా టీజీ. విఠల్, కరూరు మాధవ రెడ్డి, రిజ్వాన్‌ఖాన్ తదితరులున్నారు.

డాక్టర్ బసారెడ్డికి సన్మానం



డాక్టర్ బసారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,జూలై 11: తుమకూరులో గురువారం జరిగిన కల్పతరు వైద్యోత్సవాల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ వైద్యాధికారుల సంఘం బళ్లారి జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డిని 'వైద్యరత్న' అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్ ప్రతిపక్ష నాయకుడు సి.ఇబ్రహీంబాబు, భాజపా సభ్యులు శ్రీనివాస్ మోత్కార్, అశోక్‌కుమార్, గుడిగంటి హనుమంతప్ప, హనుమంతప్ప, నాయకులు మల్లనగౌడ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కన్నడ చిత్రాలను ఆస్వాదించాలి

బళ్లారి సిటీ, జూలై 11: కన్నడిగుల్లో ముఖ్యంగా కొత్త తరంవారు కన్నడ భాషా చిత్రాలను ఆస్వాదించేలా ప్రోత్సహించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజమ్మ జోగతి అన్నారు. సరళదేవి కళాశాల నాటకశాఖ ఆధ్వర్యంలో గురువారం 'కుబుసం' చిత్ర ప్రచార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇది వీరభద్రప్ప రాసిన 'కుబుసం' కథ అని, ఇందులో ఆమె ప్రేమ, బాధ, నిట్టూర్పు, ఆందోళన ఉన్నాయన్నారు. కష్టనష్టాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించిన ఓ మహిళ జీవిత కథ తెరకెక్కిందన్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు, దర్శకులు, ఆర్టిస్టులు బళ్లారి జిల్లాకు చెందిన వారు కావడం విశేషమని, అందుకు ఎక్కువ మంది ఈసినిమాను చూడాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మంజునాథ్‌రెడ్డి మాట్లాడుతూ మంచి సినిమా అంటే వినోదంతో పాటు విలువలు, ఆదర్శాలు ఉంటాయన్నారు. వేదికపై నాటక విభాగాదిపతి దస్తగిరీసాబ్ దిన్ని, సినీ నిర్మాతలు శోభ ఆదినారాయణ్, గుండి భారతి రమేశ్, పుష్పావతి, ఏకలవ్యట్రస్టు మంజుల, ప్రగతిసేవా సంఘం చాందిని, నాటక శాఖ అతిథి అధ్యాపకులు విష్ణు హడపాడు, నేతి రఘురాం, రచయిత మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పీడీహళ్లిలో మొహర్రం శాంతి సమావేశం

బళ్లారిరూరల్, జూలై 11 : బళ్లారి తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీస్ స్టేషన్ ఆవరణంలో బుధవారం సాయంత్రం సీఐ రుద్రప్ప, ఎస్ఐలు నాగభూషణ, పరమేశ్వరప్పల నేతృత్వంలో మొహర్రం శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ నాగభూషణ మాట్లాడుతూ మొహర్రంపండుగను హిందూ ముస్లింలు ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు. ఘర్షణలకు పాల్పడకుండా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.



కాసులు కురిపిస్తున్న కాగడా మల్లె



● వేదవతి ఒడ్డునున్న భూముల్లో విస్తరిస్తున్న పూల సాగు

బళ్లారిరూరల్, జూలై 11 : బళ్లారి తాలుకాలోని యాల్పి, కగ్గల్లు, లింగదేవనహళ్లి, కుంటనహాళ్, రూపనగుడి ప్రాంతాల్లో కాగడా మల్లె తోటలపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఈ గ్రామాలకు సమీపంలోని వేదవతి నదికి పక్కనే ఇసుకతో కూడిన పొలాలు ఈ తోటలకు ఎంతో అనుకూలంగా వున్నాయి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ రెండవ వారం నుంచి అక్టోబరు చివరి వరకు రైతులు ఈ తోటల్లో పూలు పూస్తాయి. ఈ మల్లెపూలను విక్రయించి రైతులు జీవనం సాగిస్తున్నారు. కాగడా మల్లెపూలకు ఈ సీజన్‌లో మంచి గిరాకీ వుంటుంది. గతంతో పోల్చితే ఒక ఎకరా పూల తోటకు ఖర్చు తక్కువగా పెట్టినా ఆదాయం బాగానే వస్తుందంటున్నారు. పెద్దగా తెగుళ్ళు, చీడపీడలు ఆశించే అవకాశం తక్కువ. ఎరువుల వాడకం కూడా తక్కువే. ఆరు నెలల పాటు పూలు పూస్తాయి. ఆయా గ్రామాలలోని మహిళలు పూల తోటల్లో పూలు కోస్తూ జీవనోపాధి పొందుతున్నారు. పండుగ సీజన్‌లో మంచి ధర పలుకుతుందని, ఎకరాకు రూ. రెండు లక్షల వరకు లాభం పొందవచ్చునని వ్యాపారస్తులు వివరించారు.

వారానికి ఒకసారి చెల్లింపులు



తిరుమలేష్

పై కగ్గల్లు గ్రామానికి చెందిన పూల వ్యాపారస్తుడు తిరుమలేష్ మాట్లాడుతూ, ప్రతి నిత్యం గ్రామాల నుంచి పూలు కోసుకుని తీసుకువచ్చి ఇస్తారన్నారు. మార్కెట్లో అమ్మకాల అనంతరం వారికి వారానికి ఒకసారి సొమ్ము అందజేస్తామని తెలిపారు. ఈ పూలతోటలపైనే రైతులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో వేదావతి నది వుండటంతో ఈ ఇసుక భూమిలో మల్లెపూల తోటలు అధిక దిగుబడి నిస్తున్నాయన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే జనాభా నియంత్రణ

బళ్లారి సిటీ,జూలై 11: వైద్యారోగ్యశాఖ చేపట్టిన పథకాల్లో అందరూ చురుగ్గా పాల్గొంటేనే జనాభా నియంత్రణ సాధ్యమవుతుందని మేయర్ నందీశ్ అన్నారు. జిల్లా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా జనాభా నియంత్రణపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. 1987లో ప్రపంచ జనాభా 500 కోట్లు దాటిన నేపథ్యంలో ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. ప్రస్తుతం దేశ జనాభా 144కోట్లు దాటిందని, ప్రపంచ జనాబాలో 17శాతం భారత దేశానికి చెందినవారు ఉన్నారన్నారు. కర్ణాటక రాష్ట్రంలో 6.82 కోట్ల జనాభా ఉందని, కావున ప్రజలు జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముండరగి నాగరాజు మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభా వల్ల దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జనాభా స్థిరత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన ముందు ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వైద్యులను ఆరోగ్య శాఖ సిబ్బందిని సన్మానించారు. వేదిక కార్యక్రమానికి ముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నేషనల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వీణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతాలో నర్సింగ్ విద్యార్థులు, ఆశా వర్కర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొని నగరంలోని మురికి వాడలను సందర్శించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సుకుమ్, జిల్లాకుటుంబ సంక్షేమ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పూర్ణిమ కట్టిమణి, పద్మరోజా, జల్లాసర్జన్ డా. బసారెడ్డి, నాయకులు వివేక్, ఫయాజ్, డా.అబ్దుల్లా, డా.మరియంబి, దాసప్పనవర్, డా.హనుమంతప్ప, వీరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని జెండాఊపి ప్రారంభిస్తున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా

కంప్లి, జూలై 11: కురుగోడు పట్టణంలో జరిగిన జనస్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను అధికారులు పరిష్కరించాలని జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా సూచించారు. ఈ కార్యక్రమంలో 310కు పైగా అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని విద్యుత్‌శాఖ, గ్రామ పంచాయతీ, తాలుకా పంచాయతీ, జెస్కమ్, నీటి పారుదల, మహిళా శిశుసంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ తదితర శాఖల సమస్యలపై ప్రజలు తమ అర్జీలను అందించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, జనస్పందన కార్యక్రమం ప్రజల సమస్యలు తెలపడానికి ఏర్పాటయిందని, ప్రతి ఒక్కరు ఆ సమస్యలపై అధికారులకు సమస్యలను తెలియజేసి పరిష్కరించు కోవాలని సూచించారు. ఇప్పటికే తమ నియోజకవర్గంలో కంప్లి, కురుగోడు తాలుకాల్లో జనస్పందన కార్యక్రమాల వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. అధికారులు, సిబ్బంది గ్రామాల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించి ప్రజలకు అండగా నిలబడాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖలకు మొబైల్ పరికరాలు, కంప్యూటర్లు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సుంకనూరు, తహసీల్దార్ రాఘవేంద్ర, విద్యాధికారి దుర్గన్న, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, సీహెచ్‌వో మంజునాథ్, సెక్షన్ అధికారి మంజునాథ్, కన్నడ సాంస్కృతిక అధికారి నాగరాజు, తాలుకా ఈవో నిర్మల, సుమలత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనస్పందనలో అధికారులకు అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు



సమస్యలను ఆలకిస్తున్న జిల్లా అధికారి

వీరశైవ మహాసభలో రెడ్లకు సభ్యత్వమా?

● వారికి ఓటు హక్కుపై పంచాక్షరప్ప ఆగ్రహం

బళ్లారి సిటీ, జూలై 11: అఖిల భారత వీరశైవ మహాసభలో వీరశైవ లింగాయత్‌లకు మాత్రమే సభ్యత్వం ఇవ్వాలని బైలా ఉన్నప్పటికీ బళ్లారి జిల్లాలో ఇతరులకు కూడా సభ్యత్వం ఇస్తున్నారని బిచ్చగల్లు పంచాక్షరప్ప ఆరోపించారు. నగరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కులేతరులకు రానున్న ఎన్నికల్లో ఓటు వేసే హక్కులేదన్నారు. దీనిపై రిటర్నింగ్ అధికారి దాబేరికి ఫిర్యాదు చేసినా ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రఅధ్యక్షుడు, జాతీయ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీరశైవ కులానికి, రెడ్డి సామాజిక వర్గానికి సంబంధమే లేదని, అలాంటి వారికి సభ్యత్వం కూడా ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈసందర్భంలో కోళూరు చంద్రశేఖర్‌గౌడ మాట్లాడుతూ వీరశైవులు శాకాహారులని, ప్రత్యేక దహన సంస్కారాలు చేస్తారన్నారు. వైష్ణవ వారసత్వానికి చెందిన రెడ్డి సామాజికవర్గానికి ఎన్నికల ప్రయోజనాల కోసమే మాజీ అధ్యక్షుడు చానాల్ శేఖర్ సభ్యత్వం ఇచ్చారని ఆరోపించారు. దీనికి సంబంధించి కురుగోడు తాలూకా బైలూరు గ్రామంలో వీరశైవరెడ్డిలకు 40మందికి సభ్యత్వం ఇచ్చారన్నారు. అలాంటి వారు ఓటేసేందుకువస్తే గొడవ తప్పదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మహాసభ సభ్యులు అరుణ్‌కుమార్ దాసాపూర్, శంకర్‌మూర్తి, బాణపురం నాగరాజ్‌గౌడ, కమ్మరచేడు మంజునాథ్, సండూరు వీరేశ్, మదిరి కుమారస్వామి, ఎస్.ఎం.నాగరాజుస్వామి, శరణబసవనగౌడ ఉప్పరహాసల్లి,జోలదరాశి లోకేశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పంచాక్షరప్ప తదితరులు

అనుమతులన్నీ కర్ణాటక వన్‌కేనా?



కర్ణాటక వన్ కేంద్రం వద్ద తెల్లవారుజాము నుంచే ప్రజల బారులు

సిరుగుప్ప, జూలై 11 : రేషన్‌కార్డుల్లో అవకతవకలు సరిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కర్ణాటక వన్ కేంద్రానికి బాధ్యతలు అప్పగించడం సరైందికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా నిరుపేదలు రూ.2 లక్షలకు పైగా ఉన్నప్పటికీ, అవకతవకలు సరిచేయడానికి ఒకే కేంద్రం ఏర్పాటు బవల్ల ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. రేషన్‌కార్డులలో తప్పులను సరిచేసేందుకు ఒకేఒక కేంద్రం ఏర్పాటుచేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అన్ని ఆన్‌లైన్ కేంద్రాలకు అనుమతి ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఏడో వేతన సవరణ వర్తింపజేయాలి

ఉద్యోగస్థుల సంఘం అధ్యక్షులు హెచ్ లింగరాజరెడ్డి



ర్యాలీగా వెళుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

సిరుగుప్ప, జూలై 11 : ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సవరణ వర్తింపజేయాలని సిరుగుప్ప తాలుకా ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు హెచ్ లింగరాజరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు గురువారం తమ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఇంటి వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు కూడా వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా లింగరాజరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఉద్యోగులు సేవలు చేస్తున్నారని తక్షణమే వారందరికీ ఏడవ వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీసీని రద్దు చేసి పాత పింఛన్ పద్దతిని అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు ఒత్తిడి వలన బీపీ, షుగర్‌లు రాకుండా వుండేందుకు ఆరోగ్య సంజీవిని పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవికుమార్, గౌరవాధ్యక్షులు ఉచ్చీరప్ప, కోశాధికారి ఇంజారప్ప, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ హనుమంతప్ప, ప్రముఖ ఉద్యోగులు హనుమనగౌడ, యల్లప్ప,చెన్నప్ప, సురేష్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీనంద కళాశాలలో పీయూసీ ప్రారంభం

బళ్లారి సిటీ, జూలై 11: నగరంలోని శ్రీ నంద వసతి పాఠశాలలో ఈసంవత్సరం నుంచి పీయూసీ(ఇంటర్) ఫస్ట్ ఇయర్ క్లాసులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు గాంధీ అన్నారు. గురువారం నంద వసతి కళాశాలలో తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈసంవత్సరం పియూసీ మొదటి సంవత్సరం క్లాసులు, పీసీఎంబీ,పీసీఎంసీ,సీఈబీఏ కోర్సులు ప్రారంభించడానికి అనుమతి లభించిందన్నారు. ఈసందర్భంగా కార్యదర్శి రమణకుమార్, మురళికృష్ణ, హరికుమార్, మల్లాకార్జునగౌడ,శ్రీనివాస్, గాళయ్య, రవిశ్చంద్ర, హరికృష్ణ, పార్వతి, రాజేశ్వరీ లక్ష్మికాంత్ తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదులను ప్రారంభిస్తున్న గాంధీ, హరికుమార్

మొహర్రంను శాంతియుతంగా జరుపుకోవాలి

కంప్లి, జూలై 11 : హిందూ ముస్లింలు మొహర్రం పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. కంప్లి పట్టణం 22వ వార్డులో నూతనంగా నిర్మించిన అజీమ్‌ఖాన్ మసీదు నూతనకట్టడాన్ని ఆయన ప్రారంభించారు. ధార్మిక కార్యక్రమాల్లో కులమత బేధాలు లేకుండా ఐక్యతతో ముందుకొచ్చి పండుగలు జరుపుకున్నప్పుడే గ్రామాలు, పట్టణాలలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ మసీదు కట్టడానికి ఎండీ క్యాంపు ప్రజలు, మున్సిపల్ కౌన్సిలర్ ఆర్ ఆంజనేయులు ఎంతో శ్రమించారని తెలిపారు. గతంలో ఇక్కడ మసీదు లేకపోవడం వల్ల ఆరుబయట పీర్ల దేవున్ని కూర్చోబెట్టి సంబరాలు జరుపుకునేవారని, మసీదు ఏర్పాటై అన్ని కులాల వారు ఐక్యతతో ఈ పండుగను మరింత వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లింగురువులు సయ్యద్‌షా, అబ్దుల్ హసేన్ ఖాద్రి, బట్ట ప్రసాద్, ఉలిగప్ప, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వంతోనే జీవిత సార్థకత

బళ్లారి సిటీ,జూలై 11: సంపదను పోగుచేస్తే సమస్యలు ఎక్కువగా ఉంటాయని, అలాకాకుండా ఆకలి కోసం, విజ్ఞానం కోసం ప్రతి ఒక్కరూ సమాజానికి విరాళాలు అందిస్తే పేదలకు సహాయంగా ఉంటుందని పీఎస్ఐ వెంకటస్వామి అన్నారు. నగరంలోని కౌల్‌బజార్ జాగృతినగర్‌లో కర్ణాటక రాష్ట్ర స్లమ్ చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెస్ థింక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సంస్కార అనాధ శరణాలయంలో జేకే ఫౌండేషన్ తరపున విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు విరూపాక్షయ్య మాట్లాడుతూ తమ సంస్థలో తల్లిదండ్రులు లేనివారు ఉన్నారన్నారు. వారి చదువు కోసం, భవిష్యత్తు కోసం అనేక ప్రణాళికలు రూపొందించామన్నారు. అటువంటి విద్యార్థులకు ఇదిసహాయం చేస్తుందన్నారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు గీతావిరూపాక్షయ్య, వెంకటస్వామి, పవన్‌కుమార్, సంతోష్, స్వామి జగన్, ఆనంద్ తదితరులున్నారు.

హోసూరు జోన్

ఎల్ఐసీ ప్రీమియంలపై జీఎస్టీ రద్దు చేయాలి



హోసూరు ఎంపీ గోపినాథ్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

హోసూరు, జూలై 11 : ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీ పన్నును తీసివేసే చర్యలు తీసుకోవాలని యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎంపీని స్వయంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎల్ఐసీ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హోసూరు బ్రాంచ్ చీఫ్ జయభారతి, సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, కృష్ణగిరి బ్రాంచ్ చీఫ్ పళనిస్వామి కౌంటర్, సెక్రటరీ అరుణ్ కృష్ణగిరి జిల్లా ఎంపీ గోపినాథ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎల్ఐసీని పిఎస్‌యూగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిని జాతీయ పార్లమెంట్‌లో ప్రస్తావించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

కళాభవనం ఏర్పాటుకు భూమి పూజ

హోసూరు, జూలై 11: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మత్తిగిరి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో కళాభవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ భూమి పూజల్లో పార్లమెంట్ సభ్యుడు గోపినాథ్ పాల్గొని భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంల్లో కౌన్సిలర్ మంజుళ మునిరాజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధానోపాధ్యాయురాలు కవిత కదిరేశన్, మనోహర్, అమల్‌రాజ్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీ

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ

హోసూరు (కృష్ణగిరి) జూలై 11: కృష్ణగిరి కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. భారత దేశం ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశమని, పెరుగుతున్న జనాభా ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈరోజును దినోత్సవంగా ప్రకటించిందన్నారు. మాతాశిశు ఆరోగ్యాన్ని పరిరక్షించడం, స్త్రీ విద్యను ప్రోత్సహించడం, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం పెంపొందించడం, ఆడ శిశుహత్యల నిరోధం వంటి సందేశాలను అందజేయడంలో సహకరిస్తామని వాగ్దానం చేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్నఅధికారులు

రాయచూరులో రెండో రోజు కొనసాగిన ఈడీ సోదాలు

రాయచూరు, జూలై 11 : వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతి వ్యవహారానికి సంబంధించి ఈడీ చేపట్టిన తనిఖీలు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ ఇంట్లో గురువారం రెండవ రోజు కొనసాగాయి. ఎమ్మెల్యే భార్య, కొడుకుతో పాటు ఆయన సమీప బంధువులను సైతం విచారణాధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. గురువారం అధికారుల బృందం ఒకటి దేవదుర్గ తాలూకాలోని గలగ్ గ్రామానికి చేసుకుని అక్కడ కార్తీక్ అనే వ్యక్తి గురించి వాకబు చేసినట్లు తెలిసింది. గలగ్ గ్రామం రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ భార్య పుట్టిన ఇల్లు కాగా కార్తీక్ అనే వ్యక్తి సమీప బంధువు కావడంతో పాటు ఎమ్మెల్యే తరపున బెంగళూరులో ఆయన పనులు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న ఈడీ అధికారులు ఆయనను విచారణకు పిలిచినట్లు తెలిసింది. కాగా వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతికి సంబంధించి జిల్లాలో ఈడీ అధికారులు చేస్తున్న సోదా చర్చనీయాంశమయ్యాయి.

ముగ్గురు బాలికలపై పిచ్చి కుక్క దాడి



రిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న గాయపడిన బాలికలు

రాయచూరు, జూలై 11 : తాలూకాలోని గారలదిన్ని గ్రామంలో ఆరుబయట ఆడుకుంటున్న ముగ్గురు బాలికలపై పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ సంఘటనలో గాయపడిన ముగ్గురు బాలిలను గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గతంలోను ఇదే పిచ్చి కుక్క మేకలు ఇతర జంతువులపై వ్యక్తులపై దాడి చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. ఈ క్రమంలో కుక్కను గురువారం చంపివేసినట్లు తెలిపిన గ్రామస్థులు పిచ్చికుక్క గాయానికి గురైన వారికి సరైన చికిత్సనందించి అపాయం లేకుండా చూడాలని కోరారు.


ప్రైవేటు కంపెనీ మోసంపై కేసు నమోదు చేయాలి

రాయచూరు, జూలై 11 : అధిక వడ్డీ ఆశ చూపి వినియోగదారుల నుంచి రూపాయిలు కోట్లల్లో డిపాజిట్‌లు చేయించుకున్న ప్రైవేటు కంపెనీపై కేసు నమోదు చేయాలని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.విరుపాక్షి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం ఒక్క రాయచూరు నగరానికే పరిమితం కాలేదని జిల్లా అంతటా శాఖలను ఏర్పాటు చేసుకున్న కంపెనీ దాదాపు రూ.5వేల కోట్లకు పైగా వ్యవహారం నడిపినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి విరుపాక్షి మాట్లాడారు. ఇంత తీవ్రమైన విషయం గురించి పత్రికల్లో వస్తున్నా పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. బాధితులెవ్వరు ఫిర్యాదు చేయలేదన్న కారణంగా కేసు నమోదు చేయకపోవడాన్ని తప్పుబట్టిన విరుపాక్షి వందల రూపాయిల్లో పేకాడే స్థావరాల పై ఎవ్వరు ఫిర్యాదు చేయకున్న వెంటనే అక్కడికి వెళ్లి అరెస్టు చేసే పోలీసులు, వేల కోట్ల రూపాయిల్లో కుంభకోణం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తమ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. 16 శాతం వడ్డీతో డిపాజిట్ సొమ్ము తిరిగిస్తామని నమ్మబలికి కంపెనీ యజమాని ఇప్పటికే ముఖం చాటేయగా అతనికి సంబంధించిన ఏజెంట్లు స్వేచ్ఛగా తిరుగుతున్నా పోలీసులు వారిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలని జిల్లా పోలీసులను కోరారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామత్...

జూలియస్ సీజర్



గయస్ జూలియస్ సీజర్ క్రీస్తు పూర్వం 100 జూలై 12న జన్మించారు. రోమన్ మిలిటరీ, రాజకీయ నాయకుడు. రోమన్ రిపబ్లిక్‌ను రోమన్ సామ్రాజ్యంగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. పాలనలో సంస్కరణలు తెచ్చి తనదైన ముద్రను వేశారు. జూలియన్ క్యాలెండర్‌ను రూపొందించారు. ప్రత్యర్థుల చేతిలో 44 మార్చి 15న హతమయ్యారు.

పువ్వాడ శేషగిరిరావు (జయంతి)



ఉభయభాషా ప్రవీణులు, 'కవి పాదుషా'గా పేరొందిన పువ్వాడ శేషగిరిరావు 1906 జూలై 12న కృష్ణా జిల్లా మొవ్వలో జన్మించారు. పండితులుగా, ఉపన్యాసకులుగా వ్యవహరించారు. పద్యాలు, గద్యాలు, నాటకాలు రచించారు. నవ్య కవులలో ఒకరిగా పేరొందారు. ఢిల్లీ దర్బారు నాటకం విజయవాడ నుంచి ఆలిండియా రేడియోలో ప్రసారమైంది. రక్తతర్పణం వంటి బుర్రకథలు ఎంతో పేరొందాయి. 1981 మే 24న కన్నుమూశారు.

ఆచంట శరత్‌కమల్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ఆచంట శరత్ కమల్ 1982 జూలై 12న చెన్నైలో జన్మించారు. తమిళనాట స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందినవారు. టేబుల్ టెన్నిస్‌లో బెస్ట్ ప్లేయర్‌గా డజనుసార్లు ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించారు. సీనియర్ నేషనల్ ఛాంపియన్‌ను 9సార్లు అందుకున్న తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. 2004 ఒలింపిక్ గేమ్స్‌లోనూ, 2006 ఏసియన్ గేమ్స్‌లోనూ భారత్ తరఫున ప్రాతినిథ్యం వహించారు. మెన్స్ సింగిల్స్‌లో బంగారుపతకాన్ని కైవశం చేసుకోవడం ద్వారా 'అర్జున అవార్డు' పురస్కారం సాధించారు. 2018 కామన్వెల్త్‌లో బంగారం, రజతం, కాంస్య పతకాలు సాధించారు. 2022లో ఖేల్‌రత్న అవార్డు అందుకున్నారు. 2023లో అల్టిమేట్ టేబుల్‌టెన్నిస్ సీజన్ 4లో చెన్నై లయన్స్ జట్టు రెండోస్థానంలో నిలిచింది.

మలాలా యూసఫ్ జాయ్ (పుట్టినరోజు)



చిన్నవయసులో 'నోబెల్ పురస్కారం' అందుకున్న పాకిస్థాన్‌కు చెందిన సాహస బాలిక మలాలా యూసుఫ్ జాయ్ 1997 జూలై 12న జన్మించారు. మానవహక్కులు ప్రత్యేకించి మహిళలు, చిన్నారుల విద్యకోసం ఎంతో కృషి చేశారు. ఉగ్రవాదుల అరాచకాలపై గళమెత్తారు. 'మలాలా ఫండ్' పేరిట స్వచ్ఛందసంస్థను ఏర్పాటు చేశారు. తన జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలను 'ఐ యామ్ మలాలా' పేరిట పుస్తకం రాయగా సంచలనం సృష్టించింది. పాకిస్థాన్ తొలి నేషనల్ యూత్ పీస్ ప్రైజ్, సఖరోవ్ ప్రైజ్ అవార్డులు అందుకున్నారు. 2023లో ఆక్స్‌ఫర్డ్ లైనాకర్ కాలేజ్ నుంచి గౌరవ ఫెలో అందుకున్నారు.

సీఎం సిద్ధరామయ్య రాజీనామా చేయాలి

● ముడా అవినీతికి ఆయనదే బాధ్యత ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ● నేడు మైసూరులో నిరసన

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో ఇంటి స్థలాల పంపిణీలో జరిగిన అవినీతికి బాధ్యత వహిస్తూ సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ ముడా అవినీతి వెనుక భారీ కుట్ర, కీలకులు ఉన్నారన్నారు. సమస్య పరిష్కారం అయ్యేదాకా వెనకడుగు వేసేది లేదన్నారు. శక్తి గ్యారెంటీ ఉచిత బస్సు ప్రయాణం పథకం ఆరంభం వేళ మంత్రి మహదేవప్ప భార్యకు ఉచితమని, పాటిల్ భార్యకు వర్తిస్తుందని సీఎం ప్రకటించారన్నారు. కానీ సిద్దరామయ్య భార్యకు మాత్రమే ముడాలో స్థలం ఇప్పించుకున్నారన్నారు. సిట్ విచారణకు కేటాయించి వివాదాన్ని మూసివేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. 2004లో సిద్దరామయ్య భార్య పార్వతమ్మ అన్న మల్లికార్జునస్వామి భూమి కొనుగోలు చేసినట్లు ఉందన్నారు. 2009-10లో గిఫ్ట్ డీడ్ అయినా 'ముడా' పేరుతోనే ఎందుకు ఈసీలో వచ్చిందన్నారు. సిద్దరామయ్య చెప్పినట్టుగా అది సాగుభూమి కాదన్నారు. 50/50 శాతం నిష్పత్తిన 1991 చట్టం ప్రకారం ఎకరం భూమికి 40/60 చదరపు అడుగుల విస్తీర్ణం భూమి ఇస్తారన్నారు. సిద్దరామయ్య భార్యకు రెండు స్థలాలు ఇవ్వాల్సి ఉండగా ఏకంగా 14 ప్లాట్లు ఎందుకు ఇచ్చారన్నారు. ఇది పూర్తిగా చట్టవ్యతిరేకమని సమగ్ర దర్యాప్తు జరపాల్సి ఉందన్నారు. 'ముడా'లో అవినీతి జరిగిందని జిల్లాధికారి నివేదిక ఇచ్చినా నెలకిందట 42 మందికి స్థలాలు ఇచ్చారన్నారు. సిద్దరామయ్య రాజీనామా కోరుతూ పాదయాత్రకు బదులుగా బెంగళూరు నుంచి మైసూరు దాకా కార్లర్యాలీ చేస్తామన్నారు. జేడీఎస్‌తో కలిసే పోరాటం చేస్తామన్నారు. అవినీతిని అందరూ వ్యతిరేకించాలన్నారు.



ముడా అవినీతి ఆధారాలు చూపుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

నేడు కుళ్లాయిస్వామి ఐదో సరిగెత్తు

నార్పల, జూలై 11: అనంతపురం జిల్లాలో ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి ఐదో సరిగెత్తు కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు. కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ గౌతమి శాలి గూగూడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె చిన్న సరిగెత్తు, పెద్దసరిగెత్తు, జలధి కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు 24గంటలు పోలీసులు అందుబాటులో ఉండాలన్నారు. మహిళలు, పిల్లల కోసం మహిళా పోలీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం జంట ఆలయాల్లో ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.45

అనంతపురంరూరల్, జూలై 11: అనంతపురం జిల్లా కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.45తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 85టన్నుల టమో టా దిగుబడులు వచ్చాయన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, అమ్ముడుపోయినట్లు ఎంపిక శ్రేణి కార్యదర్శి తెలిపారు.

జలపాతాల సోయగం

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్కడక్కడా వరుణుడు కరుణిస్తూ..వర్షం కురిపిస్తున్నాడు. దీంతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కేరళలో మూడు వారాలుగా ఎడతెరపి లేకుండా వానలు హోరెత్తిస్తున్నాయి. దీంతో పలు జలపాతాలు కళకళలాడుతున్నాయి. ప్రత్యేకించి ఉత్తర కర్ణాటక, తీర ప్రాంత, పశ్చిమకనుమల ప్రాంతాల్లోని జలపాతాలు సోయగాలు సంతరించుకున్నాయి. జలపాతాల వీక్షణకు జనం కదులుతున్నారు. చిక్కమగళూరు జిల్లాలో పలు జలపాతాలకు వెళ్లేందుకు ఆంక్షలు విధించగా మిగిలిన ప్రాంతాల్లో నిత్యం జలకళలను సందర్శకులు కనువిందు చేసుకుంటున్నారు. శివమొగ్గ జిల్లాలోని పశ్చిమ కనుమలకు అనుబంధమైన జోగ్ ఫాల్స్ 830 అడుగులనుంచి దూకుతూ ఆనందం పంచుతోంది. రాజా, రాణి, రోరర్, రాకెట్ పేర్లతో పిలిచే నాలుగు జలపాతాలు అద్భుతమనిపిస్తున్నాయి. ఉత్తర కర్ణాటకలో చివరిగాను, మహారాష్ట్రకు అనుబంధంగా ఉండే బెళగావి జిల్లాలోని గోకాక్ ఫాల్స్‌కు కర్ణాటక నయాగరా అనే పేరుంది. 171 అడుగుల నుంచి నీరు దూకుతోంది. చిక్కమగళూరు జిల్లాలోని కెమ్మనగుండి సమీపంలోని హెబ్బెఫాల్స్ మూడు పాయలుగా దూకనుంది. సుమారు 95 అడుగులనుంచి నీరు కిందకు పడుతోంది. ఉత్తరకన్నడ జిల్లా యల్లాపుర సమీపంలోని బేడ్తి నదికి అనుబంధంగా మాగూడు ఫాల్స్ ఉంది. 184 మీటర్ల ఎత్తునుంచి నీరు దూకనుంది. ఇక గదగ్ - బాగల్కోటె జిల్లాల్లో కురిసిన వర్షాలతో కొప్పళ జిల్లాలోని కపిలతీర్థ జలపాతం 20 అడుగుల నుంచి దూకుతుంది. ఇక్కడికి నిత్యం వందలాది మంది సందర్శకులు వస్తుంటారు.



శివమొగ్గ జిల్లాలోని జోగ్ ఫాల్స్



కొప్పళ జిల్లా కపిలతీర్థ ఫాల్స్ వద్ద పర్యాటకుల సందడి



ఉత్తరకన్నడ జిల్లాలోని మాగూడ్ ఫాల్స్





బెళగావి జిల్లాలోని గోకాక్ ఫాల్స్

బ్లాక్‌మెయిల్ కేసులో టీవీ యాంకర్ అరెస్టు

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ ఛానెల్ యాంకర్ దివ్యా వసంతను జీవన్‌భీమా నగర్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఓ స్పా సెంటర్ యజమానిని బ్లాక్‌మెయిల్ చేసిన కేసులో దివ్యా వసంత ప్రధాన సూత్రదారిగా ఉన్నారు. ఇదే కేసులో దివ్యా సోదరుడు సందేశ్ పాటు ఛానెల్ మాజీ సీఈఓ వెంకటేష్ ఇప్పటికే అరెస్టు అయ్యారు. వివాదం బయటకు రాగానే తమిళనాడు, కేరళ రాష్ట్రాల వైపు వెళ్ళిన దివ్యా వసంత వారం రోజులుగా అజ్ఞాత స్థలంలో తలదాచుకున్నారు. పక్కా సమాచారంతో జీవన్‌భీమానగర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చారు. పట్టుబడిన వారి మొబైల్ ఫోన్‌లు పరిశీలనలో స్పైరీసెర్చ్ టీం అనే పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకుని అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. దివ్యా వసంతతో పాటు బృందం మరిన్ని అక్రమాలకు పాల్పడినట్లు భావిస్తున్న పోలీసులు ఆదిశగా విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. వివాదం బయటకు రాగానే ఛానెల్ యాజమాన్యం సీఈఓతో పాటు యాంకర్‌ను తొలగించినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

నైపుణ్యాభివృద్ధి కోసం ఎన్ఎస్‌డీసీతో వీటీయూ ఒప్పందం

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఏర్పడిన నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ), విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం చేసుకుంది. గురువారం నగరంలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. ఎన్ఎస్‌డీఎసీ సంస్థ ఎండీ సీఈఓ వేదమణి తివారి మాట్లాడుతూ వీటీయూతో ఒప్పందం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉండే ఇంజనీరింగ్ విద్యార్థులకు మరింత నైపుణ్యం కల్పించేందుకు దోహదం కానుందన్నారు. 21వ శతాబ్దంలో పారిశ్రామికీకరణకు అవసరమైన డిమాండ్లను పూర్తి చేసేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు చేయదలిచామన్నారు. ఒప్పందం ద్వారా 150కుపైగా కళాశాలల్లో స్కిల్ హబ్ సెంటర్‌లను ప్రారంభిస్తామన్నారు. అదే తరహాలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలోనూ స్థాపిస్తామన్నారు. స్కిల్ ఇండియా మిషన్‌లో ముఖ్యమైన ప్రాజెక్టు ప్రధానమంత్రి కౌశల్య వికాస యోజన ద్వారా భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను కల్పిస్తామన్నారు. ప్రతి కలాశాలలోనూ 240మంది విద్యార్థులను నైపుణ్య శిక్షణలో చేర్చుకుంటమన్నారు. వీటీయూ వీసీ విద్యాశంకర్ మాట్లాడుతూ ఎన్ఎస్‌డీసీతో ఒప్పందం ద్వారా మా విద్యార్థులకు పారిశ్రామిక సంబంధిత నైపుణ్యతను శక్తివంతం చేస్తామన్నారు. ఏఐఎంఎల్, రోబోటిక్స్ వంటి రంగాలలో ఉత్తమ సాధన చేసేందుకు మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు. హాక్ టు హైర్ హాకథాన్‌లో వీటీయూ విద్యార్థులు భాగస్వామ్యులయ్యే అవకాశం ఉంటుందన్నారు.



ఒప్పందంలో ఇరు సంస్థల ముఖ్యులు

పరిషత్ సభ్యుడిగా బసనగౌడ ప్రమాణం

● ఫ్లెక్సీల ఏర్పాటుపై డీకే ఆగ్రహం ● కేసులు పెట్టిస్తా.. ● మహ్మద్ నల్‌పాడ్‌పై ధ్వజం

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటా నుంచి విధానపరిషత్‌కు ఎన్నికైన బసనగౌడ బాదర్లి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం విధానసౌధలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి ఆయనచే ప్రమాణం చేయించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు మునియప్ప, బోసరాజు, పరిషత్ విప్ సలీం అహ్మద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్త ఎమ్మెల్సీ బాదర్లికి సభాపతి, డీసీఎంలు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

డీసీఎం ఆగ్రహం

బాదర్లి ప్రమాణస్వీకారం వేళ విధానసౌధ చుట్టూ భారీగా ఫ్లెక్సీల ఏర్పాటుపై డీసీఎం డీకే శివకుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ నల్‌పాడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాదర్లి బాధ్యతలు చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి నల్‌పాడ్‌తో పాటు పలువురు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని మీతోపాటు ఉండే కోలారు కార్యకర్తపైనా కేసులు పెట్టిస్తానంటూ హెచ్చరించారు. నల్‌పాడ్ తాను వేయించలేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత పార్టీ నేతలపైనే డీకే ధ్వజమెత్తడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

పట్టుదల, కృషితోనే విజయం సొంతం

● యూఎస్‌ఏ స్పెల్‌బీ ఫైనలిస్ట్ ఆకాష్ వుకోటి ● నారాయణ 'సక్సెస్ ఒడిస్సీ'కి అనూహ్య స్పందన

అనంతపురం విద్య, జూలై 11: పట్టుదల, కృషి ఉంటే విద్యార్థులు తప్పకుండా విజయం సాధిస్తారని చైల్డ్ ప్రాడిజీ, యుఎస్‌ఏ స్పెల్‌బీ ఫైనలిస్టు ఆకాష్ వుకోటి పేర్కొన్నారు. గురువారం బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని ఎంఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నారాయణ 'సక్సెస్ ఒడిస్సీ' పేరుతో విజయోత్సవం నిర్వహించారు. ఆకాష్ వుకోటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు అంకితభావానికి దర్పణంగా నిలుస్తాయన్నారు. ఈ సక్సెస్ ఒడిస్సీ చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా నారా యణ మరిన్ని విజయోత్సవాలు జరుపుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాషానైపుణ్యంతో పాటు, పోటీతత్వ స్ఫూర్తిని చాటే స్పెల్‌బీ ప్రోగ్రాంపై సాగిన చర్చ ఆకట్టుకుంది. తర్వాత నీట్ టాపర్ సామ్ శ్రేయాస్ జోసెఫ్ తండ్రి మాట్లాడుతూ.. నారాయణ సంస్థ అందించిన విద్యాబోధనతోనే జోసెఫ్ ఘన విజయం సాధించాడన్నారు. తర్వాత కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 17 మంది విద్యార్థులను సత్కరించారు. కర్ణాటక దర్శిని పేరుతో సాగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నారాయణలో జేఈఈ, నీట్, కె సెట్, బోర్డు పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, సుమారు 800 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా సాగిన విజయోత్సవం

ఫెడరల్ బ్యాంకుతో బజాజ్ ఒప్పందం

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థ ఫెడరల్ బ్యాంకుతో బజాజ్ అలయెన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా ఫెడరల్ బ్యాంకు వినియోగదారులకు బజాజ్ అలయెన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రయోజనాలు అందనున్నాయి. ఈమేరకు బ్యాంకు ఉపాధ్యక్షుడు, ముఖ్యులు పి.వి. జాయ్ మాట్లాడుతూ బజాజ్ సంస్థ ఒప్పందంతో కార్పొరేట్ ఏజెన్సీ ద్వారా బీమా సేవలు అందించనున్నట్టు తెలిపారు. బజాజ్ అలయెన్జ్ లైఫ్ సంస్థకు చెందిన అధికారి ధీరజ్ సెహగల్ మాట్లాడుతూ ఫెడరల్ బ్యాంకుతో ఒప్పందం ద్వారా వారి వినియోగదారులకు బీమా సదుపాయాలు కల్పించదలిచామన్నారు. ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.